నేటి దినపత్రిక
సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం | 16 సెప్టెంబర్ 2024 | పేజీలు 8

# ఘనంగా వినాయక నిమజ్జనం



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని దండిగుంట వరిణి గ్రామాల కోడలు ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా స్థానిక యువత వినాయక విగ్రహానికి భారీ పూల అలంకరణ చేసి మేల తాళాలు బాణాసంచాలతో సంబరాలు చేసుకుంటూ ఊరేగింపుగా వినాయక విగ్రహాన్ని తరలించారు. ఈ సందర్భంగా స్థానిక యువత గ్రామస్తులు జై బోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తూ ఘనంగా వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

'ఆరోగ్య రక్ష' లోగోని ఆవిష్కరించిన

# ఎమ్మెల్యే కోటంరెడ్డి

**నారా లోకేష్ ఆరోగ్య రక్ష పేరుతో రూరల్‌లో వైద్య శిబిరాలు**




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నారా లోకేశ్ ఆరోగ్య రక్ష కార్యక్రమ లోగోను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరరెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నారా లోకేష్ ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 22వ తేదీ వచ్చే ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని దేవరపాలెం పంచాయతీ లోని నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి పాదాలచెంత ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. పేదలకు అందుబాటులో కార్పొరేట్ హాస్పిటల్స్ వైద్యులతో వైద్య సేవలు అందిస్తామన్నారు. తొలుత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే హాస్పిటల్‌లో వైద్య సేవలు అందిస్తామన్నారు. రాష్ట్రంలో అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ఎదుర్కొని యువగళం నిర్వహించిన లోకేష్ పేరు ఈ కార్యక్రమానికి పెట్టామన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియను కూడా ఉచితంగా నిర్వహించి, అవసరమైన వైద్య సాయం కూడా అందిస్తామన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి హాస్పిటల్‌లో చికిత్స అందిస్తామని నారా లోకేష్ ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి తెలిపారు.

విశ్వ మానవాళి కోసం..

# మహమ్మద్ ప్రవక్త రాక



**నేడు మిలాద్-ఉన్-నబి**

**విద్యుత్ దీప అలంకరణలతో ముస్తాబవుతున్న మసీదులు**

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం ప్రవక్త మహమ్మద్ ను విశ్వ శాంతి కోసం,విశ్వ మానవాళికోసం అల్లాహ్ నియమించారని అందుకే ఆయన జన్మించిన రోజున ఆయనను స్మరించుకుంటూఈద్-ఎ-మిలాద్-ఉన్-నబీ పండుగను జరుపుకుంటారు. అల్లాహ్ ప్రపంచ శాంతి కోరుతూ చివరి ప్రవక్తగా మహమ్మద్ ఎంపికయ్యాడు. ముస్లిములందరూ అత్యంత పవిత్ర గ్రంథంగా భావించే ఖురాన్ గ్రంథంలో వీటి గురించి పేర్కొనబడింది.

**మిలాద్ ఉన్-నబి విశిష్టత :**

సూఫీ లేదా బరేల్వి ముస్లింలు ఇస్లాం యొక్క చివరి ప్రవక్త ముహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని ఈద్ మిలాద్-ఉన్-నబీ లేదా ఈద్-ఎ-మిలా ద్గా జరుపుకుంటారు. దీనిని వ్యవహారిక అరబి క్‌లో నబీద్, మౌలిద్ అని కూడా పిలు స్తారు. ఈ పండుగను ఇస్లామిక్ క్యాలెండర్‌లో 3వ నెల అయిన రబీ అల్-అవ్వల్ సందర్భంగా సూఫీ, బరేల్వి ముస్లింలు జరుపుకుంటారు.

**చరిత్ర.. ప్రాముఖ్యత:**

ముహమ్మద్ ప్రవక్త (స.అ) 570 లో రబీ అల్ అవ్వల్ పన్నెండవ రోజున మక్కాలో జన్మించారని కొందరు ముస్లింలు నమ్ముతారు. 'మవ్లిద్' అనే పదానికి అరబిక్ భాషలో జన్మనివ్వడం లేదా బిడ్డను కనడం అని అర్థం అయినప్పటికీ, ఈద్-ఇ-మిలాద్ కూడా ప్రవక్త వర్ధంతి అని నమ్ముతారు. ఈజిప్టులో మొదట అధికారిక పండుగగా జరుపు కున్నారు. ఈద్-ఎ-మిలాద్ వేడుకలు 11వ శతాబ్దంలో మరింత ప్రాచుర్యం పొందాయి. ఆ సమయంలో ఈ ప్రాంతంలోని షియా ముస్లింల యొక్క అప్పటి పాలక తెగ మాత్రమే సాధారణ ప్రజలకు బదులుగా పండుగను జరుపుకునేవారు. ఈద్-ఎ-మిలాద్‌ను 12వ శతాబ్దంలో సిరియా, మొరాకో, టర్కీ, స్పెయిన్‌లు జరుపుకోవడం ప్రారంభించాయి. వెంటనే కొన్ని సున్నీ ముస్లిం వర్గాలు కూడా ఈ రోజును జరుపుకోవడం ప్రారంభించాయి.

**ప్రవక్త ఎప్పుడు పుట్టారంటే...**

చరిత్రను పరిశీలిస్తే.. మహమ్మద్ ప్రవక్త సౌదీ అరేబియాలోని క్రీ.శ. 570లో పుట్టాడని, క్రీ.శ 632 సంవత్సరంలో తన తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. మిలాద్-ఉన్-నబి పండుగ రోజున ముస్లింలందరూ కచ్చితంగా మసీదులు, ఇతర ప్రాంతాల్లో ప్రార్థనలు చేస్తారు. ఖురాన్ పఠనం, మసీదుల్లో ప్రసంగాలు వంటివి నిర్వహిస్తారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మూడవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తొలిసారి తిరుమల తిరుపతి శ్రీవారిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రశేఖరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనతోపాటు తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి కుటుంబం, ఎమ్మెల్యే కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధు కుటుంబ సభ్యులు ఉన్నారు. శ్రీవారి దర్శనం అనంతరం సోమిరెడ్డిని ఆలయ మర్యాదల ప్రకారం టీటీడీ అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఏడుకొండల స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని, రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉండాలని దేవుణ్ని ప్రార్థించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక కష్టాల నుంచి విముక్తి



## ఈ మురికిని తొలగించండి బాబూ..!



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** నివాసాల ముందే మురికి నీళ్లు తాండవిస్తున్న అటు అధికారులకు గాని ఇటు పాలకులకు గాని కనిపించడం లేదా అని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురికి నీరు నిల్వ ఉండి దోమలు క్రిమి కీటకాలు తాండవిస్తున్న ఆ నీటిని తొలగించిన పాపాన పోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సీజన్లో పలు వ్యాధులకు గురై అల్లాడుతున్న తరుణంలో ప్రధాన రహదారిలో నీరు నిల్వ ఉన్న పట్టించుకోని అధికారులు పాలకులు ఇంకేమి ప్రజల సమస్యలు నెరవేరుస్తున్నారు అంటున్నారు ఆ గ్రామస్తులు. ఆ గ్రామమే మర్రిపాడు మండలంలోని కేతిగుంట పంచాయతీ పల్లిపాడు గ్రామం. ఇప్పటికైనా ఆ మురికి నీటిని తొలగించి పుణ్యం కట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో పారిశ్రామిక రంగం

# అభివృద్ధికి కృషి

- పంచాయతీ సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్
- నా దృష్టికి వచ్చిన విద్యుత్, మంచినీటి సమస్య, సిసి రోడ్లు, స్మశాన వాటిక సమస్యలు పరిష్కరిస్తా !
- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

2 లో



# మైదానాలు.. స్థలాల్లేక క్రీడలకు ప్రోత్సాహం కరువు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని గ్రామాల్లో సరైన ఆటస్థల మైదానాలు లేకపోవడం, ఉన్నచోట కంపచెట్లతో నిండి ఉంటుండడంతో ఆటలు, క్రీడలకు ప్రోత్సాహం కరువైందని పలువురు యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏదేని క్రీడా పోటీల సమయంలో మాత్రం ఆటలు, క్రీడలను ప్రోత్స హించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు తమవంతుగా కృషి చేస్తామని చెబుతుంటారు. మళ్ళీ ఆ విషయం గురించి ఎక్కడైనా ప్రస్థావిం చడం కానీ, ప్రయత్నించిన దాఖలాలు కానరావు. ఆత్మకూరు పట్టణం విస్తరించాక ఎక్కడైనా యువత ఆటలాడుకోవాలంటూ కేవలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆటమైదానం తప్ప మరెక్కడా లేదు. ఈ మైదానం ఆటలు, క్రీడలు, వాకింగ్, సభలు, సమావేశాలు తదితరాలన్నింటికి వినియోగించుకుంటారు. ఇది తప్ప మిగతా ప్రభుత్వ, ప్రవేటు ఉన్నత పాఠశాలలకుగాని, కాలేజీలకు కానీ ఆట స్థల మైదానాలు లేవు. ఉన్నా ఆటలాడిరచే పరిస్థితి కూడా లేనట్లుంది. గ్రామాల్లో కూడా ఎక్కడైనా కాసింత జాగా కన్పిస్తే యువత అక్కడ చెట్టు పుట్టల మధ్య క్రికెట్ ఆడుతూ కన్పిస్తుంటారు. గతంలో ఆత్మకూరులో క్రీడా మైదానం నిర్మాణానికి దాదాపు రూ.1 కోటి కేటాయించగా, చాలా కాలం పనులు ప్రారంభించకపోగా ఎట్టకేలకు బైపాస్ రోడ్డు ఏరియాలో పనులు చేపట్టి కొంత మేరకు జరిగి అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధులు విడుదల కానందున ఈపనులు నిలిచిపోయాయని చెబుతున్నారు. ఆటలు, క్రీడలు బహుళ ప్రయోజనకరం, వాటిని తప్పకుండా ప్రోత్సహిస్తామని ఆత్మకూరులో చిన్నా, పెద్దా నాయకులు చెబుతుంటారే కానీ అలాంటి ప్రయత్నాలు చేసిన దాఖలాలు మాత్రం శూన్యం. గతంలో ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి చొరవతో అప్పట్లో స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కానీ ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయనందున పనులు నిలిచిపోయాయని చెబుతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారేమో చూడాల్సి ఉంది.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



(మొదటి పేజీ తరువాయి)

కల్పించడంతోపాటు అద్భుతమైన రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే శక్తిని సీఎం చంద్రబాబుకు ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నట్లు చెప్పారు. ఇటీవల వరదలు పోటెత్తిన సమయంలో ప్రకాశం బ్యారేజీపైకి వదిలిన బోట్ల వెనుక ఎవరున్నారో.. వాటి రంగులే చెబుతున్నాయన్నారు. పొరపాటున ఏమైనా జరిగివుంటే పరిస్థితి ఏంటన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గాడి తప్పిన వ్యవస్థలన్నింటిని సక్రమ మార్గంలో పెట్టి ప్రజలకు మంచి పాలన అందించేందుకు దేవుడి ఆశీస్సులతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు.

## వ్యర్థ పదార్థాలతో
# పొంచి ఉన్న ప్రమాదం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలోని గండిపాలెం, సీతారాంపురం మార్గాలలో చెత్త వ్యర్థ పదార్థాలతో ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలోని పలు విధుల్లో సేకరించిన చెత్త, వ్యర్థ పదార్థాలను పంచాయతీ సిబ్బంది సేకరించి ఆయా మార్గాలలో పడవేస్తున్నారు. ఆ వ్యర్థ పదార్థాలను కాల్చి వేస్తుండడంతో వాటి నుంచి వచ్చే కాలుష్యం అటువైపుగా వెళ్లే ప్రజలు భరించలేకపోతున్నారు. ఈ వాసన వల్ల పలువురికి ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు వాపోయారు.సంబంధిత అధికారులు స్పందించి పెద్దాలను దూరంగా పడివేయాలని పలువురు కోరుతున్నారు.

## కోడిగుంపలకు జాతీయ పురస్కారం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని శకునాలపల్లి గ్రామానికి చెందిన కోడిగుంపల శ్రీనివాసులకు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఆదివారం విజయవాడలో నిర్వహించిన తెలుగు వెలుగు జాతీయ నంది పురస్కారాల మహెూత్సవంలో భాగంగా జాతీయ పురస్కారం అందుకొన్నాడు. శ్రీనివాసులు సమాజసేవా, అన్నమయ్య సంకీర్తనల అలాపన, మ్యూజిక్ రంగాల్లో తన ప్రతిభ కనపర్చడంతో సంస్థ జాతీయ నంది పురస్కారానికి ఎంపిక చేసింది. దీంతో ఆయన నాసా సాంబశివారావు, శాంతిభాయ్, రాష్ట్ర తెలుగు వెలుగు సాహిత్య వేదిక సంపాదులు చేతులు మీదుగా పురస్కారం అందుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

## 17 నుంచి స్వచ్ఛత హీ సేవ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేసి 17 పంచాయతీలకు ఇన్చార్జ్లను నియమించామన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు.

## యూటీఎఫ్ జట్టు విజయం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :**

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఉపాధ్యాయులకు నెల్లూరు ఏసీ స సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో ఉదయగిరి యూటీఎఫ్ జట్టు క్రికెట్, వాలీబాల్ పోటీల్లో తన ప్రతిభ చాటి జిల్లాస్థాయిలో విజయం సాధించింది. క్రికెట్, వాలీబాల్ పోటీల్లో పది జట్లతో తలపడి ఉదయగిరి యూటీఎఫ్ జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మండల యూటీఎఫ్ శాఖ వారికి శుభాకాంక్షలు తెయచేస్తూ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది.

## పోలేరమ్మకు పొంగళ్లు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :**

మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీ వాసులు ఆదివారం గ్రామదేవతైన పోలేరమ్మ భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగళ్ల సామాగ్రిని నూతన బుట్టల్లో ఉంచుకొని కాలనీ పురువీధుల్లో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొన్నారు. అనం తరం ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంతోపాటు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొన్నారు.

# నియోజకవర్గంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి కృషి

**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గాన్ని పారిశ్రామిక రంగంలోఅభివృద్ధి చేస్తానని పంచాయతీలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలం జమ్మలపాలెం పంచాయతీలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని మండల అధికారులు సమక్షంలో పంచాయతీ సర్పంచ్ బుర్రి శ్రీవేణి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. ముఖ్యంగా ఆ గ్రామంలో 720 కుటుంబాలు ఉండగా ప్రతి కుటుంబం నుండి ఒకరికి ఉద్యోగం కావాలని ఎమ్మెల్యే దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మంచినీటి సమస్యను గ్రామస్తులు తీసుకురాగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి నిర్మాణం పూర్తయిన వాటర్ ట్యాంక్‌ను వెంటనే పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ప్రారంభించాలని తెలియజేశారు. అదేవిధంగా స్మశాన వాటిక సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విన్నవించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాథమిక పాఠశాల హైవే రోడ్డుకు అవతల వైపు ఉండగా విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజా దర్బార్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల బిల్డింగ్ మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన 700 పైచిలుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 4 లక్షల 30 వేల రూపాయలు నూతనంగా నిర్మించే ఇళ్లకు మంజూరవుతాయని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

సమపాలన పాటిస్తూ ప్రజలకు సేవ చేయాలని తెలియజేశారు. గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుమోహన్‌రెడ్డి, ఎంపీపీ గోచిపాతల వెంకట రమణయ్య, మండలం, గ్రామ నాయకులు, మండల అధికారులు తదితరులు ఉన్నారు.

# ఇంజనీర్లకు ఆదర్శం భారతరత్న 'మోక్షగుండం'

**▶▶ ఇంజనీర్స్‌డే స్ఫూర్తిదాయకం ▶▶ ఇరిగేష్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 'రావూరు'**





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఇంజనీర్లందరికీ భారతదేశంలో అత్యంత ఖ్యాతిపొందిన ప్రముఖ ఇంజనీర్, అనేక ప్రధాన ప్రాజెక్టుల రూపశిల్పి భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శమని, ఇంజనీర్లందరికీ ఇంజనీర్స్‌డే స్ఫూర్తిదాయకమని, ఆయన విధానాలు ఇంజనీర్లంతా ఆచరించాలని ఆత్మకూరు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రావూరు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ప్రతిఏటా నిర్వహించుకునే ఇంజనీర్స్‌డే వేడుకలను ఆదివారం ఆత్మకూరులోని ఇరిగేషన్ కార్యాలయంలో ఈఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఇ.ఇ వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ భారతదేశంలో ఇంజనీర్‌గా ప్రఖ్యాతిగాంచి ఈరంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన విశ్వేశ్వరయ్య ప్రపంచప్రఖ్యాతిగాంచిన నిర్మాణాలను ఆవిష్కరించారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ ప్రతిభతో అసాధారణ విజయం సాధించినవారిలో భారతజాతి గర్వించదగిన విశ్వేశ్వరయ్య ఇంజనీర్‌గా మనదేశ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన ఘనుడని ఆయన కొనియాడారు. ఆయన మార్గదర్శకంలో ఏర్పాటైన నిర్మాణాలు ఈనాటికి చెక్కుచెదరలేదంటే అతిశయోక్తి కాదన్నారు. అంతటి ఖ్యాతిపొందిన విశ్వేశ్వరయ్య జయంతిని దేశవ్యాప్తంగా ఇంజనీర్స్‌డేగా జరుపుకుంటున్నామని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య కర్నాటకలోని చిక్‌బళ్ళాపూరులోని మద్దెనహళ్ళిలో జన్మించినా ఆయన పూర్వీకులది ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం మోక్షగుండం అని ఆయన వివరించారు. పిన్నవయసులోనే తన తండ్రి మరణించినా ఆ దు:ఖాన్ని దిగమించి విద్యాభ్యాసం గావించారని, పుణేలోని కాలేజ్‌ఆఫ్ ఇంజనీరింగ్‌లో సివిల్ ఇంజనీర్ పట్టాపొందారని ముంబాయిలోని ప్రభుత్వ పబ్లిక్‌వర్క్స్‌శాఖలో ఏయిగా ఉద్యోగం పొంది ఆయన అద్భుతపనితీరుతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారన్నారు. అనేక ప్రాజెక్టులు ఆయన హయాంలో నిర్మించబడ్డాయని, 1909లో ఆయన మైసూర్ ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్‌గా నియమితులై మైసూరు సమీపంలోని కృష్ణరాజసాగర్ ప్రాజెక్టుకు సీఈగా వ్యవహరించారని వెంకటేశ్వర్లు వివరించారు. హైదరాబాదు, ముంబాయ్‌లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ రూపకల్పన, విశాఖపట్టణం పోర్టు ఏర్పాటు తదితరాల్లో ఆయన కీలకంగా వ్యవహరించి తన ప్రజ్ఞను చాటుకున్నారని ఇ.ఇ పేర్కొంటూ ఇంజనీర్లంతా ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆదర్శంగా భావించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డీఈ, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరుకు రాని బస్సులతో ప్రయాణీకుల అవస్థలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి రహదారి ఉంది. బైపాస్ రోడ్డు ఉంది.. డివిజన్, మున్సిపల్, నియోజకవర్గ కేంద్రంగా ఉంది. అయినా అనేక ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రావు. రెండుదశాబ్దాలకుపైగా పోరాటాలు చేసిన ప్రయాణీకులు, సమావేశాలు నిర్వహించిన నాయకులు, ప్రజా ప్రతినిధులు అలసి పోయారు. కానీ ప్రయాణీకుల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అగచాట్లు తప్పడంలేదు. అదనపు భారమని వార్యంగా ఉంది. ఇదంతా నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణ పరిస్థితి. నెల్లూరు-ముంబాయి రహదారికి 3కిలోమీటర్ల దూరంలో ఆత్మకూరు పట్టణం ఉంది. అదే ఈపట్టణానికి రవాణాపరంగా శాపంగా ఉందని సర్వత్రా భావిస్తున్నారు. గతంలో అన్నీ ఆర్టీసీ బస్సులు జాతీయరహదారిపై నెల్లూరుపాళెం కూడలినుండి ఆత్మకూరు పట్టణంలోకి వచ్చి వెళుతుండేవి. వచ్చి వెళ్ళడానికి ఓ 10నిముషాల సమయం పడుతుంది. కానీ కొంతకాలం క్రితం ఇతర జిల్లాలకు చెందిన బస్సులను బైపాస్‌రైడర్లు అంటూ ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా నెల్లూరుపాళెం నుండే రాకపోకలు సాగించసాగారు. క్రమీణా ఈజిల్లాలోని ఉదయగిరి, వాకాడు, నెల్లూరు డిపోలకు చెందిన బస్సులు కూడా పట్టణంలోకి రాకుండా నేరుగా నెల్లూరుపాళెంమీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన కర్నూలు, కడప, అనంతపురం, బనగానపల్లి, పుట్టపర్తి, కళ్యాణదుర్గం తదితర డిపోల బస్సులు, ఉదయగిరి, నెల్లూరు, వాకాడు డిపోలకు చెందిన బస్సులన్నీ ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా వెళుతుండడంతో ప్రయాణీకులు ఆయా ప్రాంతాలకు వెళ్ళాలంటే నెల్లూరుపాళెంకు చేరుకొని బస్సెక్కాల్సి ఉంది. ఆయా ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు నెల్లూరుపాళెం వద్ద దిగాల్సి ఉంది. నెల్లూరుపాళెం నుండి 20రూపాయల అదనపుభారం వెచ్చించి ప్రయాసతో ఆటోల్లో ప్రయాణించాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఇతర జిల్లాలకు చెందిన బస్సులు రాత్రివేళల్లో, అర్ధరాత్రి, తెల్లవారుఝామున నెల్లూరుపాళెంకు వస్తుంటాయి. ఆసమయంలో దిగే ప్రయాణీకులు తీవ్రంగా ఇబ్బందిపడుతుంటారు. ఎవరైనా దూరప్రాంతాలనుండి ఆయా బస్సుల్లో వచ్చేవారు ఆసమయంలో ఆటోలు లేక కూడా ఇబ్బందిపడుతుంటారు. అప్పుడప్పుడూ కొందరు విద్యార్థినిలు, ఉద్యోగినీలు ఒంటరిగా వచ్చి అక్కడ దిగుతుంటారు. ఆసమయంలో వారి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంటుంది. ఓవైపు ఆటోలకు అదనపు వ్యయం చేయడం, రాత్రివేళ ఆందోళనకు గురవుతుండడం, కనీసం జిల్లాలోని ఉదయగిరి మార్గానికి వెళ్ళాలన్నా ఆటోలో నెల్లూరుపాళెంకు వెళ్ళాల్సి రావడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకుంటోంది. ఈపరిస్థితిని గమనించిన ఆత్మకూరుకు చెందిన ప్రముఖ నాయకుడు అల్లారెడ్డి కృష్ణారెడ్డి రెండుదశాబ్దాలక్రితమే ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతోపాటు సంవత్సరాల తరబడి పోరాటం చేశారు. 2009లో ఆత్మకూరు శాసనసభ్యులుగా ఎన్నికై రాష్ట్ర ఆర్థికశాఖామంత్రిగా వ్యవహరించిన ఆనం ఈపరిస్థితిని గమనించి అప్పట్లో ఆర్టీసీ రీజనల్, జోనల్, డివిజన్, డిపో స్థాయి అధికారులతో ఓ ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రయాణీకులను రప్పించి ఇతర జిల్లాల, ఇతర డిపోల బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రానందున ఎంతగా ఇబ్బంది పడుతున్నారో వివరించారు. సమస్య తీవ్రంగా ఉందని, సత్వరమే చర్యలు తీసుకోవాలని రామనారాయణరెడ్డి ఆదేశించారు. అన్నింటికి సరేసరే అంటూ ఇతర డిపోల అధికారులతో మాట్లాడుతామని, అన్నీ బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి వచ్చివెళ్ళేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారేకానీ అలాంటి చర్యలు లేనేలేవు. కాగా నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై అభయాంజనేయస్వామి విగ్రహం వద్దనుండి ఆత్మకూరు పట్టణానికి ఓ బైపాస్‌రోడ్డు ఉంది. నెల్లూరు వైపునుండి వచ్చే బస్సులు బైపాస్‌రోడ్డుమీదుగా ఆత్మకూరులోకి వచ్చి ఇక్కడనుండి నెల్లూరుపాళెంకు వెళ్ళే అవకాశం ఉంది. కడప వైపు నుండి వచ్చే వాహనాలు కూడా నెల్లూరుపాళెం నుండి ఆత్మకూరుకు వచ్చి అక్కడనుండి బైపాస్‌రోడ్డుమీదుగా జాతీయరహదారిపైకి వెళ్ళవచ్చు. కానీ ఇంతగా ప్రయాణీకులు ఇబ్బందిపడుతున్నా, గతంలో ఆత్మకూరుకు చెందిన పలువురు ప్రజాసంఘాల ప్రతినిధులు ఇక్కడకు విచ్చేసిన రవాణాశాఖామంత్రికి ఈవిషయమై వినతిపత్రం సమర్పించినా ఎవరూ స్పందించడం లేదు. గత ఏడాది ఇక్కడకు వచ్చిన రవాణా శాఖామంత్రికి కూడా వినపత్రం ఇచ్చినా ఫలితం లేకపోయింది. ప్రయాణీకులు తీవ్రంగా వ్యవప్రయాసలతో అగచాట్లు పడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడంలేదని సర్వత్రా ప్రశ్నిస్తున్నారు. దూరం తగ్గుతుందన్న కారణంగా బస్సులన్నింటిని బైపాస్‌లుగా నడిపితే ప్రభుత్వ రంగ సంస్థకు భావ్యమేనా అని కూడా ప్రశ్నిస్తున్నారు. ఆత్మకూరు పట్టణం లోకి వచ్చి బైపాస్ మార్గంలో వెళితే కేవలం 10నిముషాల సమయం పడు తుంది. అసలు ఉదయగిరి మార్గానికి వెళ్ళాలంటే సాధారణ ప్రజలతోపాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూడా తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ప్రజల అవసరాన్ని బట్టి, అనుకూలతనుబట్టి బస్సులను నడపాల్సిన బాధ్యత ప్రభు త్వరంగ సంస్థ ఆర్టీసీకి లేదా, అదీగాక సంస్థ నేడు ప్రభుత్వసంస్థగా ఉన్నం దున మరింత బాధ్యతకాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొన్ని బస్సుల నైనా నడపాలని కోరుతున్నారు. చెన్నై తదితర ప్రాంతాలనుండి వచ్చే విద్యార్థినీలు, ఉద్యోగినిలు తీవ్ర ఆందోళనకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. మరి ఎవరైనా స్పందిస్తారేమో, చర్యలకు పూనుకుంటారేమో చూడాల్సి ఉంది.

## రేవూరులో ఘనంగా గణనాధుని గ్రామోత్సవం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం రేవూరు గ్రామంలో తొమ్మిదవ రోజు వినాయకుని గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణేశుని ప్రతిమకు ప్రత్యేక పూలాలంకరణ చేసి ఊరేగించారు. తప్పెట్లు మేళతాళాల నడుమ అలరించే కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు గ్రామోత్సవంలో పాల్గొని హారతులు పట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతసాగరం చెరువులో గణేశుని నిమజ్జనా కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని భక్తిశ్రద్ధలు చాటారు.

## సోమశిల జలాశయంలో 50 టీఎంసీల నీటి నిల్వ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల జలాశయంలో నీటి నిల్వ ఆదివారం సాయంత్రానికి 50 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు స్థిరంగా రోజుకు సగటున 14000 క్యూసెక్కుల చొప్పున వస్తోంది. జలాశయం నుండి కండలేరు రిజర్వాయర్కు పదివేల క్యూసెక్కుల నీటిని, పెన్నా డెల్టాకు 50 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. రాబోవు వర్షాకాలం సీజన్ దృష్ట్యా జలాశయంలో నీటి నిల్వను 50 టీఎంసీలకు స్థిరీకరణ చేసి ప్రాజెక్టుకు వచ్చి చేరుతున్న జలాలను వచ్చినట్లుగా కాలువల ద్వారా చెరువులకు విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

**దేశ రాజకీయాలలో..**

## ప్రత్యామ్నాయం నేతాజీ భావజాలమే..

**ఫార్వర్డ్ బ్లాక్ ఏఐఎఫ్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు**




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ ఏఐఎఫ్‌బి నెల్లూరు జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నెల్లూరు నగరంలోని ట్రంక్ రోడ్ నందు గల జీవీఎస్ కాంప్లెక్స్‌లో ఏఐఎఫ్‌బి రాష్ట్ర అధ్యక్షులు బి.సుభాష్ చంద్రా రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎఫ్‌బి రాష్ట్ర నాయకులు చింతల ఆనందబాబు ఏఐఎఫ్‌బి రాష్ట్ర అధ్యక్షులు వివిఎస్ చైతన్యలు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు మాట్లాడుతూ.. ఈ దేశంలో జరుగుతున్న అనేక అసమానతులకు రుగ్మతలకు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కారం కావాలంటే ఈ దేశానికి నేతాజీ సిద్ధాంతంతో నడిచే ఫార్వర్డ్ బ్లాక్ ప్రత్యామ్నాయంగా కాగలదని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ సమావేశంలో ఎన్నుకున్న జిల్లా నూతన కమిటీ జిల్లాలో బలమైన పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై పార్టీ కార్యాచరణను తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐఎఫ్‌బి జిల్లా కన్వీనర్‌గా పాశం నరసింహారావు కో కన్వీనర్‌గా పాడి లీలామోహన్‌తోపాటు తొమ్మిది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ముఖ్య కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

# ఇండ్ల దొంగతనం కేసులో ముద్దాయి ఆట కట్టించిన పోలీసులు

- ముద్దాయిలు అరెస్టు, సుమారు 35 సవర్ల బంగారు, సుమారు 100 గ్రాములు వెండి, నేరం చేయుటకు ఉపయోగించిన బైక్ -1, మొత్తం విలువ సుమారు 17లక్షలు
- చెడు వ్యసనాలకు బానిసై నగదు కోసం దొంగతనమే అలవాటుగా జీవిస్తున్న ముద్దాయి
- నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట, వి.సత్రం, నెల్లూరు టౌన్ పరిధిలోని తాళాలు వేసిన ఇంట్లో లక్ష్యంగా చోరీ చేస్తున్న ముద్దాయి
- చోరీ సొత్తును విలాసవంతమైన జీవితానికి ఖర్చు చేయుటకు అలవాటు పడిన ముడ్డాయి
- ముద్దాయిపై విడవలూరు, బుచ్చి, సంగం, ఇందుకూరుపేట పోలీస్ స్టేషన్ లో కేసులు, విడవలూరు పీఎస్ నందు సస్పెక్ట్ షీట్
- రూరల్ డీఎస్పీ పర్యవేక్షణలో ముద్దాయిని చాకచక్యంగా అరెస్టు చేసిన రూరల్ సీఐకి సహకరించిన సీసీఎప్ పోలీసులు
- పోలీసులను రివార్డులతో అభినందించిన జిల్లా ఎస్పీ, నెల్లూరు రూరల్ డీఎస్పీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ముద్దాయి మడపర్తి సతీష్ కుమార్ తండ్రి హజరతయ్య, వావిళ్ళ గ్రామం విడవలూరు మండలం చెందిన ముద్దాయి. ఈ ముద్దాయి 14-05-2024న ముద్దాయి జైల్ నుండి వచ్చిన తర్వాత నుండి తేదీ 15-06-2024 రోజు రాత్రి నెల్లూరు రూరల్ మండలంలోని అమంచర్ల గ్రామంలో ఓరుపల్లి అశోక్ కుమార్ తన భార్య పిల్లలతో కలిసి ఇంటి బయట పడుకొని ఉండగా ముద్దాయి ఫిర్యాది తల దిండు కింద ఉన్న తాళాలు తీసుకుని వాటితో తాళాలు తీసి లోపలికి వెళ్లి బీరువాలో ఉన్న 12 సవర్ల బంగారు 100 వెండి దొంగలించుకొని వెళ్లినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడమైనది.

తేదీ 24-07-2024 రోజున పగలు ఇందుకూరుపేట మండలం పల్లెపాడు గ్రామంలో మునుముడి చిట్టెమ్మ తన భర్తతో కలిసి నెల్లూరుకు వచ్చి తిరిగి ఇంటికి వచ్చే చూడగా ఎవరో గుర్తు తెలియని దొంగలు తాళాలు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 30 సవర్ల బంగారు దొంగలించుకుని వెళ్లినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడమైనది.

తేదీ 29-08-2024 రోజు రాత్రి వెంకటాచలం మండలం కసుమూరు గ్రామంలో వేముల తిరుపతమ్మ తన భర్త పిల్లలతో కలిసి ఇంటి బయట పడుకుని ఉండగా ముద్దాయి ఫిర్యాదు తల కింద ఉన్న తాళాలు తీసుకొని వాటితో తాళాలు తీసి లోపలికి వెళ్లి బీరువాలో ఉన్న ఏడున్నర సవర్ల బంగారు,1,75,000 డబ్బులను దొంగలించుకొని వెళ్లినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడమైనది.

తేదీ 12-09-2024 రోజులు ఉదయం 9 గంటల 30 నిమిషాలు సమయంలో ఫిర్యాది జె.లక్ష్మి ప్రసన్న చెన్నై వెళ్ళుటకు గాను ఆర్టీసీ బస్టాండ్ లోని ఫిర్యాది తన హ్యాండ్ బ్యాగ్‌ను పక్కన పెట్టి బస్సు కొరకు ఎదురు చూస్తూ ఉండగా ఫిర్యాదికి తెలియకుండా గుర్తు తెలియని దొంగలు ఫిర్యాది హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న సుమారు 12½ సవర్ల బంగారు దొంగలించుకొని వెళ్ళినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడమైనది.

**పోలీసుల దర్యాప్తు :** జిల్లాలోని దొంగతనాలు పూర్తిగా అరికట్టాలని ముమ్మురంగా బీట్లు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సూచనల మేరకు నెల్లూరు రూరల్ డిఎస్పి పర్యవేక్షణలో నెల్లూరు రూరల్ సీఐ జి.వేణు, సీసీఎస్ సిబ్బంది సహకారంతో ముద్దాయిని అదుపులోకి తీసుకొని సుమారు 35 సవర్ల బంగారు ఆభరణాలు, సుమారు 100 గ్రాముల వెండి, నేరం చేయుటకు ఉపయోగించిన బైకు-1 మొత్తం విలువ సుమారు 17 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

నేరస్తుడు మద్యపానం, చెడు వ్యసనాలకు అలవాటు పడి సంపాదించే నగదు సరిపోనందుకు దొంగతనాలకు పాల్పడుతూ, వచ్చిన నగదుతో తాగుతూ జల్సాలు చేసేవాడు. ఈ కేసును నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో నెల్లూరు రూరల్ పిఎస్ ఇన్స్పెక్టర్ జి వేణు, ఎస్ఐ బి.లక్ష్మణరావు, సిబ్బంది ఎస్ ప్రసాద్, పి.ఆదినారాయణ, షేక్ అల్లాభక్ష, జే.మునికృష్ణ, పి.శ్రీనివాసులు, సీసీఎస్ సిబ్బంది ఏఎస్ఐ జై.వెంకయ్య, ఎస్.డి వారిస్ గంగిశెట్టి భాస్కర్, సిబ్బంది షేక్ మహబూబ్ బాషా, ఎం.శివకుమార్, లను జిల్లా డిఎస్పి అభినందించి నగదు బహుమతి అందజేసి, రివార్డుల కొరకు ఎస్పీకి సిఫార్సు చేశారు.

# అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు మోక్షంలేదా !



నువ్వురుపాడు అరుంధతీయవాడలో నాలుగేళ్ళుగా నిర్మాణం నిలిచిపోయి దర్శనమిస్తున్న అంగన్‌వాడీభవనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో నిధులకొరత అని, ఇతరత్రా కారణాలని అనేక భవనాలు నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయి దర్శనమిస్తుండడం, పూర్తియిన భవనాలు వివిద కారణాలతో వినియోగంలో లేకుండా నిరుపయోగంగా దర్శనమిస్తుండడం అనాదిగా ఆనవాయితీగా ఉంది. మండలంలోని నువ్వురుపాడు అరుందతీయకాలనీలో గత నాలుగేళ్లుగా ముళ్ళచెట్ల మద్య ఒక అర్ధాంతరనిర్మాణ భవనం కన్పిస్తుంటుంది. అది అంగన్‌వాడీ భవనమని, శ్లాబ్‌లెవల్ వరకు నిర్మించి వదిలేశారని కాలనీవాసులు తెలిపారు. నువ్వురుపాడు, మహిమలూరు, అప్పారావుపాళెం, నాగులపాడు, చెర్లోయడవల్లి, సాతానుపల్లి, శ్రీనివాసపురం, పమిడిపాడుల్లో కూడా అదే మాదిరిగా భవనాల నిర్మాణాలు నిలిచిపోయి ఉన్నాయని ఆయా గ్రామాల వారు చెబుతుండేవారు. అప్పట్లో ఒక్కో భవనానికి 7లక్షల రూపాయలవంతున మంజూరు కాగా శ్లాబ్‌లెవల్ వరకు నిర్మించి వదిలేశారని చెబుతుండేవారు. ఆత్మకూరులో పలు భవనాల పరిస్థితి చూస్తే అత్యంత విడ్డూరంగా, విచిత్రంగా ఉంటుంది. 9సంవత్సరాలుగా ఆర్అండ్‌బి అతిధి గృహం భవనం, ఐదేళ్ళుగా ఆర్డీవో, తహశిల్దారు కార్యాలయాలభవనాల నిర్మాణాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. సాతానుపల్లి వద్ద నిర్మించిన పాఠశాల భవనం, కమ్యునిటిహాల్ నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా ఉన్నాయి. మహిమలూరులో డ్వాక్రా భవనం 12సంవత్సరాలుగా శ్లాబ్‌లెవల్‌లో దర్శినమిస్తోంది. ఈవిషయమై అధికారులతో మేజర్‌న్యూస్ మాట్లాడగా ప్రాజెక్ట్ పరిధిలో దాదాపు 20 భవనాలు ఇలాగే ఉన్నాయని, నిధులు కొరతతో పనులు నిలిపివేవామని తెలుపగా తమవంతుగా ఏఈ ద్వారా ఏప భవనానికి ఎంత నిధులు అవసరమో అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, ఇంకా నిధులు మంజూరు కాలేదని వారు పేర్కొన్నారు. మరి జిల్లా అధికారులు స్పందించి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటారేమో చూడాల్సి ఉంది.

## ఎస్ఐని కలిసిన మాజీ ఉపసర్పంచ్

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగర్ మండలం సోమశిల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఉప్పలపాటి శ్రీనివాస్ ఎస్ఐ అనూషను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పరిస్థితులు, అసాంఘిక కార్యక్రమాలపై ఎస్ఐ వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలు కాపాడే విషయంలో తమ వంతు సహకారం ఉంటుందని ఉప సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు బత్తల నరేష్ యాదవ్, చాట్ల పెంచలయ్య, కత్తి అనిల్, గుడిపాటి రవి తదితరులు పాల్గొన్నారు.



## వందూరుగుంటలో పోలేరమ్మతల్లికి పొంగళ్ళు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని 18వ వార్డు పరిధిలోని వందూరుగుంటలో ఆదివారం గ్రామశక్తిపోలేరమ్మతల్లికి మహిళాభక్తులు పొంగళ్లుపెట్టారు. ఈవార్డు మున్సిపల్ కౌన్సిలర్ గంధళ్ళ వేణు ఆధ్వర్యంలో మహిళలు పొంగళ్ళ ఉభయాలను ఊరేగింపుగా గుడివద్దకు తీసుకెళ్ళి అక్కడ పొంగళ్ళుపెట్టి అమ్మవారికి నైవేధ్యాలు సమర్పించారు. భాజభజంత్రీలు, బాణాసంచాలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా ఈవార్డుకు చెందిన ముస్లిం యువకుడు షేక్ షరీఫ్ పోలేరమ్మగుడికి ఒక శూలాన్ని విరాళంగా అందజేశారు. మహ్మదీయ యువకుడు షరీఫ్ పోలేరమ్మ గుడికి శూలం బహూకరించడం మతసామరస్యానికి ప్రతీక అని పలువురు కొనియాడి ఆ యువకుడిని అభినందించారు. కాగా ప్రతిఏటా వినాయకచవితి ముగిసిన తొమ్మిదవరోజు పోలేరమ్మకు పొంగళ్ళు పెట్టుకోవడం తమకు ఆనవాయితీ అని కౌన్సిలర్ వేణుపేర్కొన్నారు. పోలేరమ్మ తల్లిపట్ల తామందరికి అపారవిశ్వాసం, నమ్మకమని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వందలాదిగా మహిళా భక్తులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతోనే విజ్ఞానం

లైబ్రేరియన్ శ్రీనివాసరావు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు యువతకు పుస్తక పఠనంతోనే విజ్ఞానం లభిస్తుందని మర్రిపాడు ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పుస్తక పఠనం అలవర్చుకోవడం వల్ల పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్లకు అలవాటు పడి విజ్ఞానాన్ని వికాసాన్ని కోల్పోతున్నారన్నారు. చిన్న విద్యార్థి దగ్గర నుంచి యువత, రిటైర్డ్ ఉద్యోగులస్తుల వరకు సెల్ ఫోన్ల వినియోగం ఎక్కువైందన్నారు. దీంతో సైన్స్ పరంగా టెక్నాలజీ పెరుగుతుందే తప్ప విజ్ఞానం, మేతాశక్తి కోల్పోతుందన్న విషయం గమనించాలన్నారు. గ్రంథాలయాల్లో కూడా పలు పుస్తకాలు దొరుకుతాయని వాటిని ఉపయోగించుకుంటే పరిజ్ఞానం పెరిగి సమాజంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

## స్వయంపాకం దానం అంటే ఏమిటీ ?

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** పరిస్థితుల కారణం చేత మనం వండిన భోజనం పెట్టలేకపోయినప్పుడు, సాధారణంగా బ్రాహ్మణులు బయటి భోజనం తినరు. వారుచేసే అనుష్టానం వల్ల వారు ఎక్కడ పడితే అక్కడ భోజనాలు చెయ్యరు. (అనుష్ఠానం అంటే ఆచారం, నడవడి, వివిధ ధర్మ కర్మలు) అందుకోసం వారిని ఇబ్బంది కలిగించకుండా బ్రాహ్మణుడినే స్వయంగా తయారుచేసుకోమని ప్రార్థిస్తూ ఇచ్చేదే స్వయంపాకం.

**స్వయంపాకంకు కావలసినవి :** దోసకాయ, బీరకాయ, పచ్చి అరటి కాయలు, దొండకాయలు, చామగడ్డలు, కంద గడ్డ, ఆకుకూరల్లో తోటకూర ఇందులో మీకిష్టమైనవి కనీసం 4 రకాల కూరలు ఉండాలి. వాటితోపాటు బియ్యం, చింతపండు, పప్పులు, బెల్లం, గట్టి ఉప్పు, ఎండు మిరపకాయలు, నెయ్యి, పెరుగు ఇలా భోజనానికి సరిపడా అన్ని పదార్థాలు ఒక ఆకులో పెట్టి ఇవ్వాలి. కూరగాయలతో పాటు తోటకూర తప్పనిసరిగా వుండాలి అని చెప్తారు మనపెద్దలు. ఇవే కాకుండా దానం చేసుకోవడానికి ఏ వస్తువూ అనర్హం కాదు. విస్తరిలో బియ్యం కనీసం 1-1/4 కేజీ ఉండాలి. తీపి గుమ్మడికాయ కూడ ఇవ్వొచ్చు. మధ్యలో రెండు తమలపాకులు, వక్కలు నల్లవి, రెండు అరటిపండ్లు, తాంబూలం మీకు తోచిన దక్షిణ (51/- లేదా 116/-) ఉంచివారికి అందించాలి. దానితో వారు కూడా ఎంతో సంత సించి మీకు మీ కుటుంబానికి మంచి జరగాలని ఆశీర్వచనం పలకుతారు. (దీవిస్తారు) సౌఖ్యమైన జీవనం కోసం మంచి గుమ్మడికాయ దానం చేసుకోవచ్చు. అన్ని కలగాపులగంగా కలిపేసి ఇవ్వకుండా, వేటికీ అవి ప్రత్యేకంగా ఒక కవరు లాంటి దాంట్లో వేసి ఇస్తే వస్తువులు పాడు కాకుండా ఇంటికి తీసుకువెళ్లి వండుకుంటారు. విస్తరిలో అన్ని ఉంచిన తరువాత బియ్యం పిండితో చేసిన దీపాన్ని ఉంచి ప్రత్యేకంగా కార్తీక మాసంలో దీపదానం కూడా చెయ్యొచ్చు. దానికి విశేష ఫలితం పొందుతారు.

# ఘనంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు 14, 15 రంగనాయకుల పేట ఆర్యవైశ్య బులియన్ మర్చంట్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మొదటి రోజు అఖిలభారత సహ సంఘటన కార్యదర్శి శ్రీ బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురళీధర్ రావు, రాష్ట్ర కార్యదర్శి యచెంద్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యక్రమాత్మక విశ్లేషణ, సభ్యత్వం సంఘటనాత్మక విశ్లేషణ గురించి చరించుకోవడం జరిగింది. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యారంగ సమస్యల పైన దాని యొక్క పరిష్కారం కోసం సూచనలు సలహాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి యచంద్ర సేకరించారు. అనంతరం విద్యారంగ స్థితి పైన రిజల్యూషన్ విడుదల చేయడం జరిగింది. ఏబీవీపీ ఈ విద్యా సంవత్సరంలో కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు, ప్రముఖులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# కంటైనర్ టెర్మినల్ సాధనకై ప్రచార జాత





**జిల్లా సీఐటీయు జనరల్ సెక్రెటరీ అజయ్‌బాబు**

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అదాని కృష్ణపట్నం పోర్టులో మూసి వేయబడిన కంటైనర్ టెర్మినల్ సాధనకై అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రచార జాతరనిర్వహిస్తున్నామని జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి అజయ్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆర్టిసి బస్టాండ్ సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ప్రచార జాత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నాయకులు అంకయ్య, శ్రీనివాసులు, మహిళా కార్మికులు, ఆటో కార్మికులు, ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలకు సిఐటియు నాయకులు కరపత్రాలు పంచిపెట్టారు. ఈనెల 22వ తేదీన ముత్తుకూరు మండలం కేంద్రంగా జరగబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలి అనే నినాదంతో ప్రచార జాత చేస్తున్నామని జనరల్ సెక్రెటరీ పేర్కొన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బండ్లపాలెంలో గణపతి లడ్డు 31 500 రూపాయలు

**ఉత్సాహభరితంగా వేలంపాట ప్రక్రియ**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** వినాయక చవితి మహోత్సవాల్లో గణపతి లడ్డు వేలంపాటలు ఉత్సాహంగా.. హుషారుగా.. జోరుగా సాగుతున్నాయి. చివరి జరిగే మహోత్సవాల్లో గణపతి లడ్డు కోసం భక్తులు పోటీలు పడుతున్నారు. స్వామి లడ్డును వేలంపాటలో దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని నమ్మకంతో జనం ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం వల్లూరు గ్రామపంచాయతీ బండ్లపాలెం గ్రామంలో గణపతి మహోత్సవాల్లో బొజ్జ గణపయ్య లడ్డు వేలంపాట జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన బోలా అశోక్‌కుమార్ వేలంపాటలో లడ్డును పొందారు. 31500 రూపాయలకు స్వామి లడ్డు ఆయన కుటుంబానికి దక్కింది. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, తప్పెట్లు మోతల మోగిస్తూ బాణాసంచా కాలుస్తూ లడ్డును శిరస్సుపై పెట్టుకుని జై బోలో గణేష్ మహరాజ్ కి జై అంటూ ఆనందంగా ఇంటికి వెళ్ళాడు. గణపతి లడ్డు తీసుకోవడం వల్ల తమ కుటుంబానికి మంచి జరుగుతుందని స్వామి ఆశీస్సులు తమకు ఉండాలని గణపతి భక్తుడు తెలిపారు. స్థానిక సర్పంచ్ పల్లికొండ పెంచల ప్రతాప్ ముదిరాజ్ సహకారం అందించారు. విచ్చేసిన వారందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## విశేష పుష్పాలంకరణతో గణపతి గ్రామోత్సవం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని బేరి వీధిలో ప్రతిష్టించబడి జరిగిన వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి గ్రామోత్సవాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో విశేష పుష్పాలంకరణతో వినాయకుడిని అలంకరించారు. విశేషంగా పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని చేశారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు , బాణాసంచా పేలుళ్లు, జై బోలో గణేష్ మహారాజ్ కె జై అంటూ గ్రామోత్సవాన్ని సాగించారు. భక్తులు గణపతికి కాయ కర్పూరాన్ని నైవేద్యంగా ఇచ్చి మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. తదుపరి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని 23 డివిజన్‌లో పడారుపల్లి గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానంకు చేరుకున్న జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, ఇతర నేతలకు ఆలయ చైర్మన్, వీఆర్వో శ్రీహరి ఆధ్వర్యంలో స్వాగతం పలికి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన నేత నూనె మల్లికార్జున యాదవ్ ను ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నూనె మల్లికార్జున యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ తల్లి గుడి కమిటీ సభ్యులు బాపూజీ, మల్లికార్జున, రమణయ్య, చంటి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోరికలు తీర్చే కల్పవల్లిగా అచ్చమాంబ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని పొంగూరు మాలిచేలో వెలసిన అచ్చమాంబ దేవత భక్తులకు కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నెలకొంటూ వస్తున్నాడంతో ప్రతి ఆదివారం ఆలయం వద్ద పొంగళ్ళు పొంగించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయం వద్దకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వారి మొక్కులను మొక్కుకుంటున్నారు. ఆలయం వద్దకు వచ్చినటువంటి భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తోంది.

## నరసింహ కొండపై వామన జయంతి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండ పై వేంచేసియు న్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు ఆదివారం వామన జయంతి సందర్భంగా నరసింహకొండ రోడ్డు మార్గం నందు ఉన్న వామ న అవతారం విగ్రహం వద్ద విశేష పూజలు ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఈ పూజ కార్యక్రమాలలో అర్చకులు కృష్ణమా చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పొగాకు రైతుసంఘం నాయకుడికి సన్మానం

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం డీసీపల్లి 2024వ సంవత్సరం పొగాకు వేలం ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీసీపల్లి పొగాకు బోర్డు కేంద్రంలో ఆదివారం రోజు రైతుల తోటి బోర్డు అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 7 సంవత్సరాల నుంచి పొగాకు రైతుల సంక్షేమ అధ్యక్షులుగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మూలివెంగయ్యను పొగాకు రైతులు, బోర్డు అధికారులు ఘనంగా సత్కరించారు. పొగాకు రైతులకు మూలివెంగయ్య అండదండలుగా ఉంటూ సంక్షేమానికి పాటుపడుతున్నారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా మూలివెంగయ్య మద్దతు ధరల చట్టాన్ని పొగాకు పంటకు కూడా వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం పొగాకు రైతులకు ఓ మోస్తరు ధర దక్కిందని ఇదేవిధంగా ప్రతి సంవత్సరం పొగాకు పంటకు మంచి ధర పలికే విధంగా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



# మోక్షగుండం సేవలు మరువలేనివి



**తిరుపతిఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** కోట్లాదిమంది భక్తులు శ్రీవారిని దర్శించుకోవడానికి మొదటి ఘాట్ రోడ్డును రూపకల్ప చేసిన మోక్షగండం విశ్వేశ్వరయ్య సేవలను మరువలేనివని బిజెపి జిల్లా సాంస్కృతిక కన్వీనర్ గుండాల గోపీనాథ్ రెడ్డి కొనియాడారు. 57వ ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని ఆదివారం మోక్షగండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పుష్పాంజలు ఘటించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇంజనీర్లు అందరికీ మార్గదర్శకులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకోవడం మన కర్తవ్యం అని, ఇంజనీర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి టి సుబ్రహ్మణ్యం రెడ్డి, చిత్రపు హనుమంతరావు, కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, లక్ష్మీ పాల్గొన్నారు.

## నిరుపయోగంగా బస్సు షెల్టర్

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని డిఎం పురం పంచాయతీలో బస్సు షెల్టర్ నిరుపయోగంగా ఉంది. ప్రజల సౌకర్యం కోసం ఈ బస్సు సెంటర్ ను గతంలో నిర్మించారు అయితే ఈ బస్టాండ్ గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. పిచ్చి మొక్కలు పెరిగిపోయి తరచూ విష పురుగులతో కనిపిస్తుండడంతో అక్కడ వేచి ఉండేందుకు జనం భయపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు దృష్టి సారించి ఉపయోగం లోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సదాశివేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజ



కార్వేటినగరం, మేజర్‌న్యూస్: కార్వేటి నగరం మేజర్ పంచాయతీ వద్ద శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఆలయంలో అభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద నందీశ్వరునికి ప్రదోష పూజ వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మోహన్ రాజు, కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రిమ్మర్స్ పాఠశాలలో భోజనం వితరణ




**పలమనేరు, మేజర్‌న్యూస్:** గంగవరం మండలంలోని నడింపల్లి గ్రామంలో ఉన్న రూరల్ ఇండియా మెడికల్ అండ్ రిలీఫ్ సొసైటీ (రిమ్మర్స్) పాఠశాలలోని పిల్లలకు పగడాల వాసుదేవరావు, పద్మ, వారి కుమార్తె పగడాల హన్సిక పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు అన్న దానం చేశారు. అక్కడ చదువుకుంటున్న పిల్లలకు భోజనం పెట్టడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్రావు గాన కళాకారిణి ఎస్.సుకన్య తదితరులు పాల్గొన్నారు

## గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తా



**- ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** గిరిజనుల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్ స్పష్టం చేశారు. పద్మావతి వసతి గృహానికి చేరుకున్న ఆయనను ఆదివారం గిరిజనులు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ పలువురు గిరిజన సోదరీ సోదరీమణులు తమ సమస్యలతో కూడిన వినతులు ఆయనకు అందజేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన బాణావత్ గుండాల నాయక్ సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

## లడ్డూ వేలంలో రూ.2.2 లక్షల ఆదాయం



**నాయుడుపేట, మేజర్ న్యూస్:** స్థానిక జారు వీధిలో 23 అడుగుల భారీ వినాయకుడి విగ్రహం వద్ద ఆదివారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. లడ్డూ రూ. 2 లక్షల2 వేల 116లకు ఓ భక్తుడు దక్కించుకున్నాడు.

# ద్విచక్ర వాహన మెకానిక్‌లు సామాజిక దృక్పథంతో వ్యవహరించాలి

## - రెండవ పట్టణ సీఐ నెట్టికంటయ్య



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ద్విచక్రవాహన మెకానిక్‌లు సామాజిక దృక్పథంతో వ్యవహరించాలని చిత్తూరు రెండవ పట్టణ పోలీసు స్టేషన్ సీఐ నెట్టి కంటయ్య సూచించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం చిత్తూరు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో చిత్తూరు నగర ద్విచక్ర వాహన మెకానిక్స్ సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి, జిజేయం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవనాయుడు, ట్రాఫిక్ సిఐ నిత్య బాబు, చిత్తూరు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ నెట్టికంటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్నవారు స్కూటర్ మెకానిక్స్ సంక్షేమంపై ప్రసంగించారు. ద్విచక్ర వాహన మెకానిక్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాయనేని ధర్మారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షలకు పైగా ద్విచక్ర వాహన మెకానిక్ లు ఉన్నారని, వారికి ఇప్పటివరకు సరైన గుర్తింపు లేకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో తమను అసంఘటిత కార్మికులుగా గుర్తిస్తే పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు అర్హులమవుతామని పేర్కొన్నారు. అదే విధంగా తమకూ ప్రమాద బీమా, ఈఎస్ఐ వర్తింపజేయడం, గుర్తింపు కార్డులు మంజూరు, ఆయా జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తమ అసోసియేషన్లకు స్థలంతో పాటు భవన నిర్మాణాలకు నిధులు మంజూరు, బిఎస్ - 6 ద్విచక్ర వాహనాల మరమ్మతులపై స్కిల్ ట్రైనింగ్ ఇప్పించడం తదితర న్యాయపరమైన అంశాలను పరిశీలించి అమలు చేసి తమను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. సంఘం చిత్తూరు నగర అధ్యక్షులు మురుగేష్ మాట్లాడుతూ చిత్తూరు నగరంలో తమ సంఘ భవనం నిర్మాణం కోసం సరిపడా 10 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని, ఇదివరకే స్థలం మంజూరు విషయంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ను కలిసామన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. తమ మెకానిక్‌ల సంక్షేమ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఈ క్రమంలో ప్రజా ప్రతినిధులు అందరితోనూ సత్సబంధాలను కొనసాగిస్తామని మురుగేష్ స్పష్టం చేశారు. కాగా ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఇస్మాయిల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి లక్ష్మణరావు, చిత్తూరు నగర కార్యదర్శి బాలచంద్ర, సంయుక్త కార్యదర్శి ఎస్కే మస్తాన్, గౌరవాధ్యక్షులు ఎన్ మురుగ, నగర కోశాధికారి షణ్ముగరెడ్డి, నగర సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యులు మహమ్మద్ రఫీ, మనోహర్ రెడ్డి, సూరి, యువరాజ్, బంగారుపాళ్యం సంఘం గౌరవాధ్యక్షులు ఎస్ పురుషోత్తమ నాయుడు, ఈసీ సభ్యులు జాకీర్ భాష, చిట్టిబాబుతో పాటు దాదాపు 1000 మందికి పైగా ద్విచక్ర వాహన మెకానిక్ లు పాల్గొన్నారు.

# ఘనంగా టేప్ ఇంజనీర్స్ డే సెలబ్రేషన్స్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతిలో స్థానిక బైరాగి పట్టడలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ లో టేప్ అధ్యక్షులు మట్లి ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తుడా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీమతి దేవి కుమారి, ప్రముఖ రచయిత కోట పురుషోత్తం హాజరైనారు. భారతరత్న మాన్యశ్రీ విశ్వేశ్వరయ్య సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. టేప్ వ్యవస్థాపక అధ్యక్షులు సీనియర్ ఇంజనీర్ వెంకటరమణ దంపతులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ వారి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టేప్ చైర్మన్ టి వెంకటేష్ బాబు వైస్ ప్రెసిడెంట్ పి.నాగేశ్వరరావు, సెక్రెటరీ బుసా షణ్ముగం ట్రెజరర్ సుధాకర్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివశంకర్ రెడ్డి జాయింట్ సెక్రెటరీ రఘురాం రెడ్డి ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ సురేష్, శ్రీనివాసులు, బాలకృష్ణ, వసంతరావు, నరేష్, సందీప్ బంగారయ్య, శంకర్, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.






## అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌కి సన్మానం

శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్: శ్రీకాళహస్తి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కూనాటి సురేష్‌కి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఆదివారం శ్రీకాళహస్తి ఆయన నివాసంలో కూనాటి సురేష్‌ని పూలమాల వేసి, దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల స్థానం ఉన్నతమైనదని, తల్లీ, తండ్రి తరువాత ఉన్నతమైన స్థానాన్ని గురువుకి ఇచ్చారని, అంతటి మహోన్నతమైన స్థానంలో ఉండి, విద్యార్థిని, విద్యార్థుల భవిష్యత్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కూనాటి సురేష్‌కి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.సురేష్ సాంఘిక శాస్త్రంలో దేశావ్యాప్తంగా విద్యార్థులకు ఉపయోగపడేలా డిజిటల్ కంటెంట్ ను తయారు చేసారని, అలాగే అందులైన విద్యార్థులు కోసం ఆడియో టేప్ లను తయారు చేసారని, అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇచ్చారని తెలిసిందని, ఇటువంటి ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపడుతూ, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న కూనాటి సురేష్ ని సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీవీ కిరణ్ నాయుడు, గోగినేని భాస్కర్ నాయుడు, రవి నాయుడు, సుదర్శన్ నాయుడు, పామంజి సుబ్రహ్మణ్యం, ఢిల్లీ ప్రతాప్, ఈర్ల కిషోర్, కాంగ్రెస్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## కత్తితో కోసుకోవడం తప్పుడు కేసులు పెట్టడం



**వెంకటగిరి, మేజర్‌న్యూస్:** మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు దాసరపల్లి వెంకటరమణ తప్పుడు కేసులు, ఎస్సీ ఎస్టీ కేసులు ఆ ముసుగులో బర్రెలు గొర్రెలు మేకలు దొంగతనాలు చేస్తూ ఈజీ మనీకి అలవాటు పడి తప్పుడు కేసులు పెడుతూ సొంత అన్న తమ్ముడు బంధువులని తేడా లేకుండా కేసులు పెట్టి మానసిక శోభకు గురిచేస్తూ సునకా ఆనందం పొందుతున్నాడు. కరెంట్ బిల్లు కట్టమంటే వాళ్ళ మీద కేసులు, అంగన్‌వాడీ కోడిగుడ్లు అడిగితే వాళ్ల మీద కేసులు, బహిరంగ ప్రదేశాలు మద్యం తాగవద్దు అంటే మహిళల మీద కేసులు, ఇలాంటి వందల కేసులు పెడుతూ జనాలను భయాందోళనకు గురిచేసి గ్రామాన్ని శాంతిభద్రత విషయంలో నాశనం చేస్తున్నాడు. మద్యంతాగడం, కేసులు పెట్టడం డబ్బులు డిమాండ్ చేసి రూ.500, రూ.1000 రూపాయలకు కేసులు విత్‌డ్రా చేయడం, పొలాలు అన్ని డబ్బులు తీసుకోవడం మళ్ళీ వాళ్ళ పొలాల్లో ఉన్న నిమ్మ చెట్లను మెరుపు చెట్లను వాళ్ళ ముఠాదిగా నరికించడం డబ్బులు డిమాండ్ చేయడం ఇదే ఆయన నైజం దానికి తోడుగా వాళ్ల భార్య వెంకటరమణమ్మ, డి.వెంకటేశు, వి.అనిల్, సిహెచ్. వెంకటేష్, పి.సంతోష్ తోడుగా ఉంటూ బర్రెలను గొర్రెలను దొంగతనం చేసే దాంట్లో అతని అనుచరులుగా ఉంటూ ఒక ముఠా మాదిరిగా ఏర్పడి జనాలను భయాందోళన గురి చేస్తున్నారు. మరిన్ని కేసులు పెట్టిస్తూ జనాలను భయాందోళన గురిచేస్తున్నారు. అందుకోసం స్థానిక వెంకటగిరి సర్కిల్ ఆఫీస్ నందు బాధితుల గోడును సీఐ ఏవి రమణకి తెలియజేశారు. అతని మీద సమగ్ర విచారణ చేసి తప్పుడు కేసుల నుండి మిమ్మల్ని కాపాడుతానని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాధితులకు హామీ ఇచ్చారు.

మట్టి దోపిడీ చేసిన దొంగలని పట్టుకోవడమే..

# ఎన్డీఏ కూటమి లక్ష్యం

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలంలో మట్టి దోపిడీ దొంగలను పట్టుకోవడమే ఎన్డీఏ ముఖ్య లక్ష్యమని జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పేర్కొన్నారు. ముందుగా మండలంలోని కనుపూరు చెరువును ఆదివారం సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ.. సర్వేపల్లి నియోజకవర్గానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా, గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసినటువంటి కాకాణి గోవర్ధన్ రెడ్డి గత ఐదేళ్ల వైసీపీ పాలనతో సర్వేపల్లి నియోజకవర్గాన్ని సర్వనాశనం చేశారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి, అతని అనుచరులు కలిసి గ్రావెల్, మట్టి దోపిడి ఇష్టానుసారంగా చేసి చెరువులను, కొండలను, ప్రభుత్వ భూములను ఎందుకు పనికి రాకుండా సర్వనాశనం చేశారు. ఏదైతే కాకాణి గోవర్ధన్ రెడ్డి మైమరిచి చిల్లర దొంగలు అనే పదం వాడారో. ఆ చిల్లర దొంగలు కాకాణి అండ్ బ్యాచ్ అన్న విషయం సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు. సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువులలో రూ.కోట్ల రూపాయల గ్రావెల్ ను కొల్లగొట్టి ప్రజా సంపదను దోచుకుంది గత వైసీపీ పాలకులు కాదా.. అవుననే చెబుతారు సర్వేపల్లి ప్రజలు.



కాకాణి మాటలను నమ్మే పరిస్థితిలో సర్వేపల్లి ప్రజలు లేరు. కాబట్టే గత సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లి ప్రజలు ఓటుతోనే కాకాణికి బుద్ధి చెప్పారు. కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్‌లలో జరిగిన గ్రావెల్, మట్టి దోపిడీపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విజిలెన్స్ విచారణ చేయించి మట్టి, గ్రావెల్ దోపిడీ చేసిన చిల్లర దొంగలను పట్టుకోవాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం. చిల్లర దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానిదేనన్నారు. చిల్లర దొంగల ముఠా నాయకుడు ఎవరైతే ఉన్నారో ఆ నాయకుడు పైన కూడా కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. ఆ దిశగా ఎన్డీఏ కూటమిలో భాగంగా ఉన్న జనసేన పార్టీ ఒప్పుకునే ప్రసక్తే లేదు. చెరువులను కాపాడినప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు. గత పాలకులు చేసిన మట్టి దోపిడీ కారణంగా కనుపూరు చెరువును, కనుపూరు కాలువలు నాశనమైపోయాయి. ఆనాడు చిల్లర దొంగలు చేసిన మట్టి దోపిడీని అడ్డుకోకుండా మామూళ్ల మత్తులో ఉండి సహకరించిన ప్రభుత్వ అధికారులు ఎవరైతే ఉన్నారో వాళ్ళ పైన కూడా కఠిన చర్యలు తీసుకునేదాకా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణి భవాని నాయుడు, జనసేన పార్టీ నాయకులు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, ఆస్తోటి రవికుమార్, అఖిల్, విష్ణు, రహీం, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు పట్టణంలో

# రోడ్డు విస్తరణ గ్రహణం తొలిగేదెన్నటికో !




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం లోని ప్రధానరహదారి కొంతమేరకు విస్తరణ పనులు నిలిచిపోయి ఒకటి కాదు, రెండుకాదు తొమ్మిదేళ్ళవుతున్నా ఎవరూ పట్టించకోవడం లేదని, ఇంకా గ్రహణం వీడడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై ఎన్నిదపాలుగా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తెస్తున్నా ఎవరూ స్పందించడం లేదు. ప్రధానమైన పట్టణంలోని మెయిన్‌రోడ్డు విస్తరణ ఆగిపోగా ఇంతటి నిర్లక్ష్యమా అని కూడా పలువురు ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో కొందరు రోడ్డుకిరువైపులా ఉన్న గదుల యజమానులు అభ్యంతరం పెట్టడం, కోర్డులో స్టేపొందడం తదితర కారణాలతో పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటరు నుండి ఆర్టీసీ డిపోవరకు రహదారి విస్తరణ, డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్ పనులు నిలిచిపోయాయి. అయితే కోర్డు పెండింగ్‌లు కూడా పరిష్కారం కాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయనందున పనులు పున:ప్రారంభం కావడం లేదని తెలుస్తోంది. 2012లో ఆనం రామనారాయణరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రిగా ఉన్న సమయంలో ఆత్మకూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించారు. అందులో భాగంగా నెల్లూరు-ముంబాయి రహదారిపై నెల్లూరుపాళెం నుండి పట్టణంలోని సోమశిల రోడ్డు వరకు ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో, అక్కడనుండి పట్టణం లోని కాంగ్రెస్ కార్యాలయభవనం వరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిధులు వెచ్చించి రోడ్డును విస్తరించి డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే సోమశిల రోడ్డు సెంటర్ నుండి ఆర్టీసీ డిపోవరకు కొందరు దుకాణాదారులు, భవనాల యజమానులు రోడ్డు మధ్య నుండి 35అడుగులు రోడ్డు విస్తరిస్తే తమ స్థలాలు కోల్పోవాల్సి ఉంటుందని, భవనాలు కొంతమేరకు తొలగించాల్సి ఉంటుందని అభ్యంతరం తెలిపారు. అప్పట్లో రామనారాయణరెడ్డి అధికారులు, భవనాల యజమానులతో చర్చించి 30అడుగులుగా నిర్ణయించారు. అక్కడేమో సమ్మతి తెలిపిన కొందరు ఈనిర్ణయంపై కోర్టులో స్టేపొందారు. దాంతో అక్కడ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. 2013లో ఈపనులు జరుగగా ఆర్టీసీ డిపోనుండి సోమశిల రోడ్డు సెంటరు వరకు పనులు జరగకుండా నిలిచిపోయాయి. అయితే కోర్టులో పెండింగ్‌లు తొలిగిపోగా నష్టపరిహారం చెల్లింపు, రోడ్డు పనులుకు 3కోట్ల రూపాయలుండగా 6కోట్లు అవసరమని ఆర్‌అండ్‌బి అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. అక్కడ నుండి నిధులు మంజూరు కాలేదు. ఈలోగా రోడ్డు గుంటలమయమై జనాలు, వాహనకారులు నానా అవస్థలు పడసాగగా ఆర్‌అండ్‌బి అధికారులు తాత్కాలికంగా తారురోడ్డు వేశారు. డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్‌కు మున్సిపాలిటీ నిధులు సిద్ధంగా ఉంచినా రోడ్డు విస్తరణ జరగనందున వారు ఆనిధులతో ఇతరత్రా పనులు చేపట్టారు. ఇక అప్పటినుండి ప్రభుత్వం నుండి నిధులు మంజూరుకాలేదు. రోడ్డు విస్తరణకు పట్టిన గ్రహణం వీడడం లేదు. పట్టణంలో పాతహాలు సెంటరు నుండి సోమశిల రోడ్డువరకు, ఆర్టీసీ డిపోనుండి నెల్లూరుపాళెం వరకు రోడ్డు విస్తరించి డివైడర్లు నిర్మించి సెంట్రల్‌లైటింగి వేయగా ఆకర్షణీయంగా ఉండగా మధ్యలో మాత్రం రోడ్డు సింగిల్‌గా, సెంట్రల్‌లైటింగ్, డివైడర్లు లేకుండా ఉండగా ఈరోడ్డు జనాలకు, వాహనకారులకు అసౌకర్యంగా ఉంటోంది. మరి ఈరోడ్డుకు పట్టిన గ్రహణం వీడాలంటే మంత్రి మేకపాటి గౌతంరెడ్డి దృష్టి సారిస్తే ఆఘమేఘాలమీద కాగలదని సర్వత్రా అభిప్రాయపడినా ఫలించలేదు. గౌతంరెడ్డి మృతి చెందడంతో ఆయన రాజకీయవారసుడుగా విచ్చేసిన మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టి సారించలేదు. కాగా గతంలో ఈరోడ్డు విస్తరణకు కృషిచేసిన ఆనం రామనారాయణరెడ్డి ఈదపా ఇక్కడే ఎమ్మెల్యేగా విజయంసాధించి రాష్ట్రమంత్రివర్గంలో చోటు దక్కించుకొని కొనసాగుతున్నారు. ఈరోడ్డు విస్తరణకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. ఈమేరకు అధికారులతో కూడా చర్చించారు. ఇక అధికారులు కార్యక్రమం వేగవంతం చేయాలని సర్వత్రా కోరుతున్నారు.


సూర్య www.suryaa.com



రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, దుత్తలూరు, కొండాపురం, బుచ్చి, మనుబోలు, కొడవలూరు, కోవూరు, ఇందుకూరుపేటలలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1, LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు. సెల్: 9000 118811


## మానవత్వం చాటుకున్న పల్లవోలు యువత




**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధిత చిన్నారి హబీబాకు మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన యువత 50వేలు ఆర్థిక సహాయం ఆదివారం అందించి మానవత్వం చాటుకున్నారు. ఇంకా మరింత సహాయ సహకారాలు అందిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. క్యాన్సర్ వ్యాధితో హబీబా బాధపడుతూ ఉన్న తరుణంలో 10లక్షల రూపాయలు వైద్యశాలకు అవసరమైంది. తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో వైద్యం చేయించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో పల్లవోలు గ్రామానికి చెందిన యువత 50వేలు ఆర్థిక సాయం చేయడంతో వారి మానవత్వానికి పలువురు అభినందించారు.

## అధ్వాన్నంగా నల్లపురెడ్డిపల్లి రోడ్డు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆరోడ్డు కేవలం 2కిలో మీటర్లలోపే.. నిత్యం మూడు గ్రామాల ప్రజల రాకపోకలు.. ఆత్మకూరుకు కూతవేటు దూరంలోని గ్రామ రహదారి.. అవస్థలమయం.. ఆందోళనకరం.. ఇదే ఆత్మకూరు మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామరహదారి. ఆత్మకూరు-బట్టేపాడు రోడ్డునుండి నల్లపురెడ్డిపల్లికి వెళ్ళే రోడ్డు ఇరువైపులా పచ్చనిపైర్లతో పొలాలు కాగా మధ్యలో అడుగడుగునా ఏర్పడిన గుంటలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాహనాలు ఆరెండు కిలోమీటర్లు వెళ్ళాలంటే అర్ధగంటకుపైగా పడుతుందని వాపోతున్నారు. ద్విచక్రవాహనకారులైతే నానా అవస్థలు పడతుండడంతోపాటు రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. వర్షాలసమయంలో ఆగుంటల్లో నీరుచేరి ప్రమాదాలకు నిలయాలుగా మారుతుంటాయి. అడుగడుగునా ఏర్పడిన ఈగుంటలను చూస్తుండే పాలకులు కానీ, అధికారులు కానీ కనీసమరమ్మత్తులు చేయించే యోచనే చేయడంలేదని ఆయా గ్రామాల ప్రజలు నిష్టూరం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఆరోడ్డును పరిశీలిస్తున్న విలేకరులతో పలువురు మాట్లాడుతూ.. తమ రోడ్డు దుస్థితి గురించి అనాదిగా ఎవరూ పట్టించుకోవడంలేదని తీవ్ర ఆవేదనతో తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, మండల, గ్రామస్థాయి పాలకులు స్పందించాలని, మరమ్మత్తులకు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.